క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దౌల్తాబాద్: మండల పరిధి నర్సాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతు, ట్రీకటింగ్ కారణంగా గురువారం నందారం, నర్సాపూర్, కౌడీడ్ గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ మహిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంతరాయానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారి

దౌల్తాబాద్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మలేరియా నివారణ కొడంగల్ సబ్ డివిజన్ అధికారి పకీరప్ప అన్నారు. బుధవారం మండల పరిధి దేవర్‌ఫసల్‌వాద్ గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వానాకాలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, మలేరియా, డెంగీ, చికున్‌గున్యా తదితర వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా ఆరోగ్య, పంచాయతీ సిబ్బంది తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీశైలం, ఆశకార్యకర్తలు. ఏఎన్‌ఎంలు ఉన్నారు.

నకిలీ విత్తనాలతో మోసపోవద్దు

గుర్తింపు పొందిన దుకాణాల్లోనే కొనండి: ఏఈఓ



సమావేశంలో మాట్లాడుతున్న ఏఈఓ

పూడూరు: నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి రైతులు మోసపోవద్దని, వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన ఫర్టిలైజర్ దుకాణాల్లోనే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని వ్యవసాయ విస్తీర్ణ మండల అధికారి రాంబాబు సూచించారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అధికారి మాట్లాడారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని రైతులకు చెప్పారు. నాసిరకం విత్తనాల బారిన పడొద్దని, ప్యాకింగ్ లేనివి అసలు కొనుగోలు చేయరాదని పేర్కొన్నారు. ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కొడంగల్: ఎస్‌ఐ భరత్‌రెడ్డి తన సిబ్బందితో బుధవారం రాత్రి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పలు వాహనాలను తనిఖీ చేశారు. ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. నంబర్ ప్లేట్ లేని వారితో పాటు, అతి వేగంగా వాహనాలు నడిపిన వారికి జరిమానా విధించారు. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిలో వాహనాలను పరిశీలించారు. అనుమతులు లేకుండా రాకపోకలు సాగిస్తున్న వారికి ఫైన్ వేశారు.

కుక్కల బెడద నుంచి రక్షించండి

అనంతగిరి: కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని బీఆర్‌ఎస్ యూత్ విభాగం రాష్ట్ర నాయకుడు రాజేందర్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టర్ కార్యాలయంలో ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఇటీవల జిల్లాలో పిల్లలు, పెద్దలపై కుక్కలు దాడి చేసిన ఘటనలు అనేకం ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. లేని పక్షంలో వచ్చే నెల 10న పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడతామని వెల్లడించారు.

కట్టమైసమ్మ ఆలయంలో చోరీ

తాండూరు టౌన్: తాండూరు పట్టణం ఆదర్శనగర్ కట్టమైసమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. పట్టణ ఎస్‌ఐ కాశీనాథ్ వివరాల ప్రకారం.. ఆలయ ద్వారం తాళం పగలగొట్టి, దొంగలు గర్భ గుడిలోకి చొరబడ్డారు. అమ్మవారి మెడలోని పుస్తెల తాడు, మెట్టెలు ఎత్తుకెళ్లారు. హుండీని పగలగొట్టి నగదును కాజేశారు. ముందస్తుగా.. సీసీ కెమెరాలను ధ్వంసం చేసిన దుండగులు అనంతరం దొంగతనానికి పాల్పడ్డారు. ఆలయ కమిటీ సమాచారంతో సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్‌ను స్వాధీనం చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆశ్రమ నిర్మాణానికి విరాళం

తాండూరు టౌన్: తాండూరు పట్టణం సాయిపూర్ శివారులో నిర్మిస్తున్న అయ్యప్ప దీక్షాపరుల మురుగన్ ఆశ్రమ భవన నిర్మాణానికి సాయిపూర్ వాసి, కాంగ్రెస్ యువనేత బంటు వేణుగోపాల్.. బుధవారం ఆశ్రమ కమిటీకి రూ.లక్ష విరాళం అందజేశారు.

కాగ్నాపై కొత్త వంతెన



కాగ్నా నదిలోని పాత బ్రిడ్జి



కొత్త వంతెన నిర్మాణానికి కొనసాగుతున్న మట్టి పరీక్షలు

- జాతీయ రహదారి ఏర్పాటులో భాగంగా నిర్మాణం
- మట్టి పరీక్షలు, అప్రోచ్ రోడ్డు పనులు ప్రారంభం

యాలాల: కర్నాటక రాష్ట్రం చించోలి నుంచి మహబూబ్‌నగర్ వరకు జాతీయ రహదారి మంజూరు అయిన నేపథ్యంలో.. మండల పరిధి తాండూరు–కొడంగల్ మార్గంలోని కాగ్నా నదిపై కొత్త వంతెన నిర్మాణానికి ఆవశ్యకత ఏర్పడింది. ఇందులో భాగంగా ఇప్పటికే ఇరువైపులా అప్రోచ్ రోడ్డు పనులను చేపట్టగా, తాజాగా నదిలో బ్రిడ్జి పిల్లర్ల ఏర్పాటుకు సాయిల్ టెస్టింగ్(మట్టి పరీక్షలు) నిర్వహిస్తున్నారు. నిర్మించనున్న బ్రిడ్జి ప్రస్తుతం ఉన్న బ్రిడ్జి, పాత వంతెన మధ్యలో ఏర్పాటు చేయనున్నారు.

చురుగ్గా విస్తరణ పనులు

జాతీయ రహదారి పనుల్లో భాగంగా మండల పరిధి బండమీదిపల్లి నుంచి తిమ్మాయిపల్లి, దౌలాపూర్, చెన్నారం, లక్ష్మీనారాయణపూర్ పరిధి వరకు రోడ్డు విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు, ముళ్ల పొదలను తొలగించి మొరం, కంకరతో చదును చేస్తున్నారు. అవసరమైన చోట కల్వర్టుల నిర్మాణం చేపడుతున్నారు. పనులు వేగంగా కొనసాగేందుకు వీలుగా లక్ష్మీనారాయణపూర్ శివారులో కాంక్రీటు ఏర్పాటు యంత్రాలను ఏర్పాటు చేశారు.

వానాకాలానికి ముందే పిల్లర్లు

ఈ మార్గంలో వాహనాల రాకపోకల సంఖ్య పెరగడంతో పాటు కర్నాటక పరిధి చించోలి నుంచి తెలంగాణలోని మహబూబ్‌నగర్ వరకు నేషనల్ హైవే రోడ్ మంజూరు అయింది. అందులో భాగంగా ఇటీవల పనులను ప్రారంభించారు. కొత్త రహదారి నాలుగు వరుసలు కావడంతో కొత్త బ్రిడ్జిన పక్కన మరో వంతెనను నిర్మించనున్నారు. ఈ మేరకు నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు పనులను చేపట్టారు. ప్రస్తుతం ఉన్న బ్రిడ్జికి దిగువన ఉన్న పాత బ్రిడ్జికి చేరువగా పనులు చేపట్టనున్నారు. నది మధ్యలో పిల్లర్ల నిర్మాణ పనులు త్వరగా చేపట్టేందుకు రంగం సిద్ధం చేశారు. వానాకాలం ప్రారంభానికి ముందే పిల్లర్లు పూర్తిచేసేలా చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

> **మట్టి పరీక్షలు పూర్తవగానే..**
>
> నది మధ్యలో కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టనున్నాం. ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్నప్పటికీ జాతీయ రహదారి పనులు చేపడుతున్న కాంట్రాక్టరుకు నిర్మాణ బాధ్యతలు అప్పగించాం. మట్టి పరీక్షలు పూర్తవగానే పిల్లర్ల పనులు ప్రారంభించే అవకాశం ఉంది. – శ్రావణ్, ఆర్‌అండ్‌బీ ఏఈ, యాలాల

అలా నాటడం.. ఇలా నరకడం

విద్యుత్ తీగల కింద ఉన్నాయంటూ.. చెట్ల నరికివేత



పంచాయతీ రాజ్ రోడ్డు పక్కన చెట్లను నరికివేసిన విద్యుత్ సిబ్బంది

మోమిన్‌పేట: ఆకుపచ్చ తెలంగాణే లక్ష్యంగా పచ్చదనం పెంపకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా చేపట్టిన హరితహారం కార్యక్రమం ద్వారా ఖాళీ స్థలాలు, రహదారులకు ఇరువైపులా ఉపాధి కూలీలతో ఏటా మొక్కలు నాటిస్తోంది. వాటి పరిరక్షణ గ్రామ కార్యదర్శులు తదితర సిబ్బందికి అప్పగించింది. నాటిన వాటిల్లో ఒక్క మొక్క ఎండినా, నరికినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. విద్యుత్ తీగల కింద చెట్లు ఉన్నాయంటూ ఆ శాఖ సిబ్బంది ఏపుగా పెరిగిన చెట్లను మొదళ్లకు నరికివేయడం ఆందోళన కలిగిస్తోంది. ఎంతో వ్యయప్రయాసల కోర్చి, ఎంతో మంది శ్రమించి పెంచిన పచ్చదనంపై ఇలా గొడ్డలి వేటు మంచిది కాదని పర్యావరణ ప్రేమికులు, గ్రామీణ ప్రాంత ప్రజలు హితవుపలికారు. విద్యుత్ తీగలకు అడ్డుగా అనిపిస్తే.. కొమ్మలను తొలగిస్తే సరిపోతుందని, కాని ఇలా ఏకంగా మొదళ్లనే నరికిస్తే ఎలా ప్రశ్నిస్తున్నారు.

రక్తదానం ప్రాణదానం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్

అనంతగిరి: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ విజయభాస్కర్‌గౌడ్ అన్నారు. బుధవారం వికారాబాద్ ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో రెడ్ క్రాస్‌సొసైటీ, ప్రభుత్వ ఆస్పత్రి సహకారంతో ఎక్సైజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. రక్తదానం ప్రతి ఒక్కరు చేయవచ్చని, దీనిపై ఎలాంటి అపోహలు వద్దని సూచించారు. రక్తదానం చేస్తే.. ఆపదలో ఉన్న వారిని కాపాడినవారమవుతామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ రాఘవీణ, టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐలు, పలువురు సిబ్బంది, ప్రాంత యువకులు తదితరులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

నేషనల్ సెమ్స్ ఒలంపియాడ్‌లో ఐదో ర్యాంకు



అంకిత

ధారూరు: నేషనల్ సెమ్స్ ఒలంపియాడ్(ఎన్ఎస్ఈఎంఎస్) జాతీయ టాలెంట్ టెస్ట్‌లో గిరిజన విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో రాణించింది. ఈ మేరకు బుధవారం వెలువడిన ఫలితాల్లో మండల కేంద్రంలోని చైతన్య పాఠశాల విద్యార్థిని అంకిత ఐదో ర్యాంక్ సాధించింది. 4వ తరగతి చదువుతూ పరీక్ష రాసిన బాలిక.. స్టేషన్ ధారూరుకు చెందిన గోపినాయక్ కూతురు. కాగా.. రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించిన అంకితను పాఠశాల కరస్పాండెంట్ మధు, డైరెక్టర్ రాజు, ఉపాధ్యాయులు అభినందించారు. ఇదిలా ఉండగా.. జూన్‌లో హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో నిర్వాహకులు బాలికను అవార్డుతో సన్మానించనున్నారు.

నిషేధిత పదార్థాలు విక్రయిస్తే చర్యలు



కిరాణా దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

దోమ: నిషేధిత పదర్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ఆనంద్ కుమార్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని పలు దుకాణాలను పోలీసులు తనిఖీ చేశారు. ఈ సోదాల్లో రెండు కిరాణా దుకాణాలు, ఓ పాన్ షాప్‌లో గుట్కా ప్యాకెట్లు లభ్యం కాగా.. ఆ దుకాణ నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడారు. దుకాణ దారులు నిషేధిత మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

మరుగుదొడ్లకు మరమ్మతులు



బస్టాండ్‌లో మరుగుదొడ్డి

కొడంగల్: కొడంగల్ ఆర్టీసీ బస్టాండ్‌లోని మరుగుదొడ్లకు మరమ్మతు పనులు చేపట్టారు. పర్యవేక్షణ లోపంతో.. అవి అసౌకర్యంగా మారాయి. దీంతో ప్రయాణికులు వాటిని ఉపయోగించేందుకు అయిష్టత చూపుతున్నారు. విధిలేక కొందరు ప్రయాణ ప్రాంగణంలోని పరిసర ప్రాంతాలను వినియోగిస్తుండగా.. చాలామంది ఎటు వెళ్లాలో తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా.. టాయిలెట్స్ సరిగా లేని కారణంగా ప్రయాణికులు, ప్రాంగణంలోని ఆరు బయట వినియోగిస్తున్న నేపథ్యంలో వెలువడుతున్న దుర్వాసనతో దుకాణదారులు, ప్రాంత వాసులు ఇబ్బంది పడుతున్నారు. గుర్తించిన ఆర్టీసీ అధికారులు మరమ్మతు పనులకు చర్యలు తీసుకున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పనులు త్వరగా పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

'బడిబాట' సమావేశం నేడు

తాండూరు రూరల్: పాఠశాల పునఃప్రారంభంలో భాగంగా ప్రభుత్వం జూన్ 1వ తేదీ నుంచి బడిబాట కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ సమావేశ మందిరంలో చేపట్టే సమీక్షకు పాఠశాలల హెచ్‌ఎంలు హాజరుకావాలని కోరారు.

కుల్కచర్ల: మండల పరిషత్ కార్యాలయంలో 'బడిబాట' కార్యక్రమంపై సమీక్ష నిర్వహించనున్నట్లు ఎంఈఓ హబీబ్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధి అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలన్నారు.

కంటి వైద్య శిబిరాన్ని వినియోగించుకోండి

కుల్కచర్ల: కంటి వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాశ్, కంటి వైద్య అధికారి జవహర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో 25 మందికి వైద్య పరీక్షలు చేశారు. అందులో 15మందికి కంటి శుక్లాల సమస్య ఉందని గుర్తించి శస్త్రచికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అనంతరం వైద్యులు మాట్లాడారు. ప్రతి బుధవారం ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించే శిబిరాన్ని కంటి సమస్యలు ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది సిరాజ్, నవీన్ ఉన్నారు

బోర్ మోటార్ బిగింపు

పూడూరు: తాగునీటిని సరఫరా చేసే బోరు మోటార్లు మరమ్మతుకు గురికావడంతో మండల పరిధి కంకల్ గ్రామానికి తాగునీటి సమస్య ఏర్పడింది. ఇదే విషయాన్ని గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువజన నాయకుడు వీరేష్.. ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే.. రెండు కొత్త బోరు మోటార్లను అందజేశారు. దీంతో చెడిపోయిన వాటి స్థానంలో గురువారం కొత్తవాటిని బిగించారు. నీటి సమస్యను తీర్చినందుకు ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పంటకాలం పూర్తయ్యేవరకు దాచండి

ఏఓ నిషాంత్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: రైతులు విత్తనాలు ఎరువులను కొనుగోలు చేసే సమయంలో తగిన జాగ్రత్తలను పాటించాలని మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్ సూచించారు. బుధవారం రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండల పరిధి మధురాపూర్, కిషన్‌నగర్, భీమారం, వెంకన్నగూడ తదితర గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో విత్తన కొనుగోలు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఓ రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన దుకాణాల్లో విత్తనాలను కొనుగోలు చేయాలని, అదే సమయంలో రసీదు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన విత్తన ప్యాకెట్‌లను, రసీదులను పంటకాలం పూర్తయ్యేవరకు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. లూజుగా ఉన్న సంచులలోని విత్తనాలను కొనుగోలు చేయొద్దని సూచించారు. నకిలీ విత్తనాలను అమ్ముతున్నట్లుగా మీ దృష్టికి వచ్చిన వెంటనే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు తేజ్‌కుమార్, నిఖిల్‌రెడ్డి, రమణారావు, ప్రియాంక, ప్రణీత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'పల్లెప్రకృతి'ని కాపాడండి



అధికారులతో మాట్లాడుతున్న డీపీఓ

మర్పల్లి: పల్లెప్రకృతి వనంలో మొక్కలు ఎండిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ జిల్లా అధికారి జయసుధ జీపీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం ఆమె మండల పరిధి పంచలింగాల, మర్పల్లి, పట్లూరు గ్రామాల్లో పల్లె ప్రకృతి వనం, తెలంగాణ క్రీడా మైదానం, వైకుంఠధామం, నర్సరీ తదితర వాటిని ఆమె పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను అధికారులు, కార్యదర్శులు నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. క్రీడా ప్రాంగణాలు వినియోగంలో ఉండేలా చూడాలన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ రాజమల్లయ్య, ఎంపీఓ సుశీల్‌కుమార్, గ్రామాల పంచాయతీ కార్యదర్శులు లక్ష్మీకాంత్, సంతోష, కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మహిళలకు కుట్టుమిషన్ల అందజేత



మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, వాణి

శంకర్‌పల్లి: తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం, వనిత చేయూత ప్రాజెక్టులో భాగంగా బుధవారం మండలంలోని మోకిల గ్రామంలో ఎంపిక చేసిన 10 మంది మహిళలకు కుట్టుమిషన్‌లు అందజేశారు. అనంతరం ఫోరం ఇండియా ప్రెసిడెంట్ రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు అనేక పథకాలు, ప్రోత్సాహకాలు అందిస్తోందని కొనియాడారు. ఇందులో భాగంగానే మహిళలకు సాయం చేసేందుకు తమ ఫోరం ముందుకు వచ్చినట్లు స్పష్టం చేశారు. వనిత చేయూత ప్రాజెక్టు అధ్యక్షురాలు వాణి మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ ప్రాజెక్టుకు ఏడు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలను కుట్టే బాధ్యత అప్పగించిందని, దానిని ఈ విధంగా ఉపయోగించుకోనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వీపీవో సుజాత, పద్మ, సుధాకర్, భీమయ్య, అనంతయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు టీకాలు ఇప్పించండి



కేశవగూడలో జీవాలకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

చేవెళ్ల/షాబాద్: రైతులు గొర్రెలు, మేకలకు వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా ఇప్పించాలని షాబాద్ మండల పశువైద్యాధికారిణి డాక్టర్ స్రవంతి అన్నారు. మండల పరిధి కేశవగూడ, నరేడ్లగూడ గ్రామాల్లో బుధవారం ఆమె గొర్రెలు, మేకలకు టీకాలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాలు తిరిగి పశువైద్యశాఖ ఆధ్వర్యంలో టీకాలను వేస్తున్నామని, జీవాలను పోషించుకునే రైతులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది బలరాం, రాణి, రైతులు తదితరులు ఉన్నారు.

పట్టపగలు వెలుగుతున్న వీధి దీపాలు



బాకారంలో వెలుగుతున్న వీధిలైట్



తోల్‌కట్టలో..

పట్టించుకోని అధికారులు

మొయినాబాద్‌రూరల్: విద్యుత్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పట్టపగలే వీధి దీపాలు వెలుగుతూ వారి నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నాయి. దీంతో విలువైన కరెంట్ వృథా అవుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీధి దీపాల నిర్వహణలో ఉన్న సమస్యలను విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మండల పరిధి చాలా గ్రామాల్లో వీధి దీపాలు నిరంతరం వెలుగుతూనే కనిపిస్తున్నాయి. పగలు, రాత్రి తేడాలేకుండా వెలుగు తుండడంతో వందలాది యూనిట్లు విద్యుత్ వృథా అవుతోంది. బుధవారం మండల పరిధి బాకారం, తోల్‌కట్ట, చిన్నమంగళారం, వీరన్నపేట్ ఆయా గ్రామాల్లోని వీధులోని స్తంభాలకు ఉన్న దీపాలు పగలు వెలుగుతూ కనిపించాయి. జీపీ ఆదాయం, జనాభా మేరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయగా.. రాత్రి పూట ఆన్ చేసి ఉదయం పూట ఆఫ్ చేయాలి. కానీ అలా జరగడం లేదు. దీంతో గ్రామ పంచాయతీలకు వేలాది రూపాయల బిల్లులు వస్తున్నాయి. అధికారులు స్పందించి గ్రామాల్లో వీధి లైట్లకు ఆన్, ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. పలు చోట్ల స్విచ్‌లు అవి ఉన్నా ఆఫ్ చేయకపోవడంతో ఈ వీధి లైట్లు వెలుగుతున్నాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పై అధికారులు స్పందించి పగటి పూట వీధి దీపాలు వెలగకుండా చూడాలని కోరుతున్నారు.

బస్సులేదు.. బడికెలా వెళ్లాలి?

- పల్లెవెలుగుకు నోచుకోని గ్రామాలు
- ముందుకు సాగని ఉన్నత విద్య
- ఆందోళనలో విద్యార్థులు
- కొరవడిన రవాణ సౌకర్యంతో గ్రామీణ ప్రజల ఇక్కట్లు



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థులు (ఫైల్)

అనంతగిరి: కొరవడిన రవాణా సౌకర్యంతో గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇబ్బడిముబ్బడిగా పెంచిన చార్జీలను చెల్లించలేకపోతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు. మండల పరిధి గ్రామాల విద్యార్థులు ప్రాథమికోన్నత వరకు స్థానికంగా చదివినా.. ఉన్నతస్థాయి, ఇంటర్, డిగ్రీ ఆపై విద్యాభ్యాసం కోసం మండల కేంద్రం వికారాబాద్, ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. కానీ పల్లెలు పల్లెవెలుగుకు నోచుకోకపోవడంతో వారి చదువులు ప్రశ్నార్థకంగా మారాయి. బస్సులు రాక.. సరిగా బడికి వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

గంటల కొద్దీ నిరీక్షణ

కరోనా కంటే ముందు మండల పరిధి గ్రామాలకు తిరిగే బస్సులను ఆర్టీసీ నిలిపివేసింది. పులుమద్ది, ఎర్రవల్లి, సర్పన్‌పల్లి, అత్వెల్లి, మదన్‌పల్లి, పాతూర్, కామారెడ్డిగూడ, బురాన్‌పల్లి, పులుసుమామిడి, పీరంపల్లి, కొటాలగూడకు ప్రజా రవాణా సౌకర్యమే లేకుండా పోయింది. దీంతో చదువుకోసం విద్యార్థులు, ఇతర పనుల కోసం ఆయా గ్రామాల ప్రజలు రవాణా కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఆటోలను ఆశ్రయిస్తున్నారు. లేదా గ్రామాల నుంచి ప్రధాన రోడ్డు సుమారు 2నుంచి 4 కిలో మీటర్ల వరకు నడిచి వెళ్తున్నారు. అయినప్పటికీ.. బస్సుల కోసం గంటల కొద్దీ వేచి చూస్తున్నారు.

నిండితే కాని కదలని ఆటో..

సాధారణంగా పల్లెల నుంచి మండల కేంద్రానికి, తదితర ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేసే ఆటోలు.. సీట్ కెపాసిటీకి మించి ప్యాసింజర్ ఎక్కితే కాని అవి ముందుకు కదలవు. దీంతో చేసేదిలేక ప్రజలు గంటల కొద్ది నిరీక్షణ తప్పడం లేదు. ఏ మాత్రం ఆలస్యం అయినా.. ఆరోజు విద్యార్థులు బడి, కళాశాల మానుకోవాల్సిందే. అంతే కాకుండా నిత్యం ఆటోల్లో విద్యాభ్యాసం కోసం వెళ్లాలంటే ఆర్థిక భారం అవుతుందని విద్యార్థులు, వారి తల్లి దండ్రులు వాపోతున్నారు. ఖర్చు భరించినవారు.. చదుకుంటే.. స్తోమత లేనివారు ఇంటికే పరిమితమవుతున్నట్లు తెలుస్తోంది.

బస్సులు తిప్పండి..

మైలార్‌దేవరాంపల్లి రూట్‌లో బస్సులు వేరే మండలం నుంచి ప్రయాణికులతో నిండుగా రావడంతో గ్రామానికి వచ్చే సరికి ఫుట్ బోర్డుపై ప్రయాణం చేయాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ రూట్‌లో అదనపు బస్సులు నడపాలని కోరుతున్నారు. ఇదే విషయమై మూడు రోజుల క్రితం పల్లెలకు బస్సు సౌకర్యం కల్పించాలని తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య జిల్లా ప్రతినిధులు విద్యార్థులతో కలిసి కలెక్టర్ నారాయణరెడ్డిని కలిశారు. గ్రామీణ ప్రాంత రవాణా సమస్యలను పేర్కొంటూ వినతి పత్రాన్ని అందజేశారు. బస్సులు లేక బడికి వెళ్లలేక పోతున్నామని, విద్యాసంవత్సరం ప్రారంభ నాటికి పల్లెలకు ఆర్టీసీ బస్సులు తిప్పి, రవాణా కష్టాలను దూరం చేయాలని కలెక్టర్‌ను కోరారు.